సాక్షి ఆదిలాబాద్

శనివారం । 24 । జూన్ । 2023

మాయ'లేడీ' బాగోతం



ఉద్యోగాలిప్పిస్తానని మోసం చేసి జైలు పాలైన మాయలేడీ బాగోతం తవ్వినకొద్దీ బయటపడుతోంది. తాజాగా మరికొందరు బాధితులు బయటకువచ్చి తమ గోడు వెళ్లబోసుకున్నారు.

10లో▸



చదువుతోనే గుర్తింపు

11లో▸

చదువుతోనే గుర్తింపు సాధించవచ్చని వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బోథ్ మండలంలోని నక్కలవాడ, లక్ష్మీపూర్ గ్రామాల్లో ఆయన పర్యటించారు.

గరిష్టం/కనిష్టం
31.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు తగ్గనున్నాయి. పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మంత్రిని కలిసిన జెడ్పీ చైర్మన్



మంత్రి ఐకే రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్ తదితరులు

కైలాస్‌నగర్: రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్‌తో కలిసి హైదరాబాద్ సెక్రటేరియట్‌లో మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

'శ్యామ్‌ప్రసాద్' కృషి చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఆదిలాబాద్: సామాజిక న్యాయం కోసం శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చేసిన కృషి చిరస్మరణీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకులు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శంకర్ మాట్లాడుతూ, శ్యాంప్రసాద్ అప్పట్లో చేసిన కృషి ఫలితంగానే ప్రస్తుతం కశ్మీర్ ప్రత్యేక అధికారాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగారెడ్డి, ఆదినాథ్, రవి, లాలామున్నా, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా టీఏసీ సభ్యుడిగా దినేశ్



నియామక పత్రం అందుకుంటున్న దినేశ్

ఆదిలాబాద్: బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దినేశ్ కుమార్ మటోలియా ఉమ్మడి జిల్లా టెలీకాం అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా నామినేట్ అయ్యారు. ఈ మేరకు బీఎస్‌ఎన్‌ఎల్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ దేవిదాస్ జిల్లా కేంద్రంలోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలో ఆయనకు నియామక పత్రం అందజేశారు.

మంత్రి సత్యవతి రాథోడ్‌ను కలిసిన ఎమ్మెల్యే బాపూరావు



మంత్రిని కలిసిన ఎమ్మెల్యే బాపూరావు

తాంసి: రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌ను బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావుతో కలిసి భీంపూర్ మండల బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం కలిశారు. హైదరాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో కలిసి పలు సమస్యలను విన్నవించారు. మహారాష్ట్ర సరిహద్దున ఉన్న కరంజి(టి) నుంచి రాజుల్‌వాడి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. కరంజి(టి) సర్పంచ్ నరేందర్ తదితరులు ఉన్నారు.

రేపు జిల్లాస్థాయి క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25న జిల్లా స్థాయి అండర్-19, 25 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా ఇన్‌చార్జి నరోత్తంరెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని కై లాస్‌నగర్‌లో గల వీఎన్నార్ క్రికెట్ అకాడమీలో ఈ పోటీలు ఉంటాయని తెలిపారు. అండర్-19 పోటీలకు 2004 ఏప్రిల్ 1లోపు, అండర్-25 పోటీలకు 1998 సెప్టెంబర్ 1లోపు జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. పోటీలకు హాజరయ్యే వారు తమ వెంట ఆధార్, క్రికెట్ కిట్, వైట్ డ్రెస్ తెచ్చుకోవాలని సూచించారు. వివరాలకు 89193 50894, 93986 57588 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

తొలకరి పలకరించే..



పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు

జిల్లాను ఎట్టకేలకు తొలకరి పలకరించింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఇప్పటి వరకు మండుటెండలతో ఉక్కిరిబిక్కిరి అయిన జనానికి కాస్త ఉపశమనం కలిగినట్లయింది. మరోవైపు మృగశిర కార్తె ప్రారంభమై 20 రోజులుగా వరుణుడు కరుణించకపోవడంతో ఆందోళనలో గడిపిన అన్నదాత కళ్లల్లో ప్రస్తుతం ఆనందం కనిపిస్తోంది. తొలకరి రాకతో అంతా చేల బాట పట్టారు. సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. విత్తనాలు విత్తే పనుల్లో బిజీగా మారారు.

– కైలాస్‌నగర్, (ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్)



విత్తనాలు నాటేందుకు చేనును సిద్ధం చేస్తున్న రైతులు



కొరటా–చనాఖా బ్యారేజ్

ప్రారంభం.. సందిగ్ధం!

- ఇంకా పూర్తికాని 'కొరటా– చనాఖా'
- పెండింగ్‌లోనే డిస్ట్రిబ్యూటరీ పనులు
- కెనాల్ వర్క్స్ మాత్రమే పూర్తి.. బ్యారేజ్, పంప్‌హౌస్ తుది దశకు
- జూలై మొదటి వారంలో సీఎం రాక అంటూ ప్రచారం
- వేగవంతం చేసినా పనులు పూర్తయ్యేది అనుమానమే!

సాక్షి,ఆదిలాబాద్: తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులో లోయర్ పెన్‌గంగ నదిపై నిర్మిస్తున్న కొరటా–చనాఖా ప్రాజెక్టును జూలై మొదటి వారంలో సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారనే ప్రచారం సాగుతోంది. అయితే ముఖ్యమంత్రి పర్యటన ఇంకా అధికారికంగా ఖరారు కాలేదు. మరోవైపు ప్రాజెక్ట్ పనులు చాలావరకు పెండింగ్ ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఒకవేళ సీఎం పర్యటన ఖరారైనా దీని ప్రారంభం ఉంటుందా.. లేదా అనేది సందిగ్ధంగా మారింది. కెనాల్ వర్క్స్ పూర్తవగా.. బ్యారేజ్, పంప్‌హౌస్ పనులు తుది దశకు చేరాయి. డిస్ట్రిబ్యూటరీ పనులు పెండింగ్‌లో ఉండడంతో చివరి ఆయకట్టు వరకు నీరు చేరలేని పరిస్థితి.

51 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా..

లోయర్ పెన్‌గంగపై తెలంగాణ–మహారాష్ట్ర నది భూభాగాన్ని కలుపుతూ కొరటా–చనాఖా ప్రాజెక్ట్ పనులకు రూ.1,227 కోట్ల అంచనా వ్యయంతో 2015–16లో పరిపాలన అనుమతి ఇచ్చారు. 2016–17లో కాంట్రాక్ట్ సంస్థలతో ఒప్పందం పూర్తి చేసుకొని ఆదిలాబాద్ నియోజకవర్గంలోని రెండు మండలాల్లో, బోథ్ నియోజకవర్గంలోని ఒక మండలంలో మొత్తంగా 51వేల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రణాళిక రూపొందించారు. తెలంగాణ వైపు కొరటా, మహారాష్ట్రవైపు చనాఖా గ్రామాల మధ్య పెన్‌గంగ భూభాగంపై బ్యారేజ్, దానికి కొద్ది దూరంలో పంప్‌హౌస్, కాలువల నిర్మాణం, డిస్ట్రిబ్యూటరీ పనులు, పిప్పల్‌కోటి రిజర్వాయర్ చేపడుతున్నారు. ఆ తర్వాత ఈ ప్రాజెక్టుకు సంబంధించి అంచనా విలువలను సవరిస్తూ వచ్చారు. ఈ పనులన్నింటికి సంబంధించి ఇప్పటికే పలుమార్లు గడువు పెంచేశారు. అయినా ఇప్పటికీ పూర్తి కాలేదు.

ఇదీ పరిస్థితి..

లోయర్ పెన్‌గంగ కింద బ్యారేజ్ పనులు తుది దశకు వచ్చినప్పటికీ, కెనాల్స్‌కు సంబంధించి వందెకరాల భూ సేకరణ చేయాల్సి ఉంది. ఇందుకోసం రూ.10 కోట్లు అవసరం. పంప్‌హౌస్‌కు సంబంధించి ఎలక్ట్రో మెకానికల్ వర్క్ పెండింగ్‌లో ఉంది. అదనంగా రూ.10 కోట్లతో పరికరాలు కొనుగోలు చేయాల్సి ఉంది. ఒక్క ఎల్‌పీపీ కెనాల్ పనులు మాత్రమే వంద శాతం పూర్తయ్యాయి. ఇక డిస్ట్రిబ్యూటరీకి సంబంధించి 750 ఎకరాల భూ సేకరణ చేయాల్సి ఉంది. ఇందుకోసం రూ.75 కోట్లు ప్రభుత్వం మంజూరు చేయాల్సి ఉంది.

కొరటా–చనాఖా బ్యారేజ్
నిర్మించే ప్రాంతం: జైనథ్ మండలం కొరటా గ్రామం నుంచి మహారాష్ట్రలోని చనాఖా గ్రామం వైపు
అంచనా విలువ : పన్నులు పోనూ రూ.339 కోట్లు
పని పురోగతి :90 శాతం

లోయర్ పెన్‌గంగ ప్రాజెక్ట్ మెయిన్ కెనాల్
నిర్మించే ప్రాంతం : జైనథ్, బేల మండలాల్లో 42 కిలో మీటర్ల పరిధిలో
అంచనా విలువ : రూ.259 కోట్లు
పని పురోగతి : 100 శాతం

పంప్‌హౌస్..
నిర్మించే ప్రాంతం : జైనథ్ మండలం హట్టిఘాట్ (బ్యారేజ్‌కు సమీపంలో)
అంచన విలువ : రూ.119 కోట్లు
పూర్తయిన పని విలువ: రూ.95 కోట్లు
పని పురోగతి : 93 శాతం

డిస్ట్రిబ్యూటరీ సిస్టమ్
నిర్మించే ప్రాంతం: జైనథ్ మండలం
డిస్ట్రిబ్యూటరి నంబర్లు: డి–14, డి–15, డి–16
అంచనా విలువ : రూ.22.98 కోట్లు
పని పురోగతి : మెయిన్ కాలువ పనుల్లో డి–14, 15 పూర్తి కాగా, మైనర్, సబ్ మైనర్ పనులు పూర్తి కావాల్సి ఉన్నాయి. 16లో మెయిన్ పనుల్లో కొంత పనులు పూర్తి కాగా మైనర్, సబ్ మైనర్ పూర్తి చేయాల్సి ఉన్నాయి.

ఇతర డిస్ట్రిబ్యూటరీ పనులు
నిర్మించే ప్రాంతం :జైనథ్, బేల మండలాల్లో
డిస్ట్రిబ్యూటరీ నంబర్లు:డి–16 ఏ, డి–17, డి–18, డి–19
అంచన విలువ : రూ.147.33 కోట్లు
పని పురోగతి : 16ఏ మెయిన్ పనులు కొంత పూర్తి కాగా, మైనర్, సబ్ మైనర్ పనులు చేపట్టాల్సి ఉంది. 17,18,19 డిస్ట్రిబ్యూటరీ మెయిన్‌తో పాటు మైనర్, సబ్ మైనర్ పనులు చేపట్టాల్సి ఉన్నాయి.

అన్నదాత సంక్షేమానికి పెద్దపీట



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పరుషోత్తం రూపాల

- కేంద్ర మంత్రి పరుషోత్తం రూపాల



హాజరైన కార్యకర్తలు, నాయకులు

ఉట్నూర్‌రూరల్: ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అన్నదాత సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని కేంద్ర పశు సంవర్ధక, మత్స్యశాఖ మంత్రి పరుషోత్తం రూపాల అన్నారు. స్థానిక తిరుమల ఫంక్షన్ హాల్‌లో ఖానాపూర్ నియోజకవర్గ మహాజన సంపర్క అభియాన్, బీజేపీ మోర్చాల సంయుక్త సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అన్నదాత సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. పీఎం చేపట్టిన హరిత విప్లవంతో రైతుల ఆదాయం పెరిగిందన్నారు. గతంలో యూరియా కోసం లాఠీచార్జీలు సైతం చోటు చేసుకునేవని, ప్రస్తుతం ఆ ఇక్కట్లు దూరమయ్యాయన్నారు. అలాగే రూ.18 లక్షల కోట్ల నిధిని కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రైతులకు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. వ్యవసాయంతో పాటు మత్స్య, అనుబంధ రంగాలకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర పథకాలను ప్రజలకు వివరిస్తూ రానున్న రోజుల్లో రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బీజేపీ జిల్లా ఇన్‌చార్జి అల్జాపూర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజలకు అవినీతి రహిత పాలన అందిస్తూ అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, పార్టీ నాయకులు జయశ్రీ, అయ్యన్నగారి భూమయ్య, సుహాసినీరెడ్డి, రాథోడ్ రితేశ్, హరి నాయక్, భుక్యా జానుబాయి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు ఊడ్చి దివ్యాంగుల నిరసన



తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో దివ్యాంగులు కలెక్టరేట్ ఎదుట చేస్తున్న రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో రోడ్డు ఊడ్చి నిరసన వ్యక్తం చేశారు. దివ్యాంగుల కోసం జిల్లా కేంద్రంలో ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతీ దివ్యాంగుడికి పింఛన్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక ప్రధాన కార్యదర్శి ఫైసల్ అహ్మద్, నాయకులు అష్రఫ్‌ఖాన్, రితిక్, ఫెరోజ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు. – కైలాస్‌నగర్



ఒకే వృక్షం.. వర్ణాలు రెండు

తాంసి మండలంలోని వడ్డాడి గ్రామ సమీపంలో గల చింతచెట్టు భిన్న వర్ణాలతో ఆకట్టుకుంటుంది. మండుటెండలకు పూర్తిగా ఎండిపోయిన ఈ చెట్టు ఇటీవల కురిసిన వర్షాలతో కొంత భాగం చిగురించింది. మరో సగభాగం అరుణవర్ణశోభను సంతరించుకుని ఈ మార్గం గుండా వెళ్లే వాహనదారులను ఆకర్షిస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్,ఆదిలాబాద్

గోడకు వినతి..



గోడకు వినతిపత్రం అతికిస్తూ..

బోథ్: మండలంలోని పొచ్చెర క్రాస్‌రోడ్డు వద్ద గల సెయింట్ థామస్ పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఏఐఎస్‌ఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రేమ్, మున్సిఫ్ ఆరోపించారు. ఈ మేరకు ఎంఈవోకు ఫిర్యాదు చేసేందుకు మండల విద్యాధికారి కార్యాలయానికి శుక్రవారం వెళ్లగా అక్కడ అధికారి అందుబాటులో లేకపోవడంతో గోడకు వినతిపత్రం అంటించి నిరసన తెలిపారు.

ఎన్నిక ఎప్పుడో..?

- గొల్ల, కుర్మ సొసైటీ జిల్లా అధ్యక్షుడి ఎన్నికలో తీవ్ర జాప్యం
- ఐదేళ్లుగా కులస్తుల ఎదురుచూపు
- చొరవచూపని అధికారులు

జిల్లాలోని..
గొర్రెల పెంపకందారుల ప్రాథమిక సహకార సంఘాలు: 136
మొత్తం సభ్యులు : 9,787
ఇప్పటి వరకు ఎన్నికలు జరిగిన మండల సహకార సంఘాలు : 97
ఇంకా ఎన్నికలు నిర్వహించని సంఘాలు : 39
అధికారులు ప్రతిపాదనలు పంపించిన సంఘాలు: 35
హైదరాబాద్‌లో పెండింగ్‌లో ఉన్నవి: 04

కైలాస్‌నగర్: పశుసంవర్ధకశాఖ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గొల్ల, కుర్మలకు అందించే పథకాలు, రాయితీ యూనిట్లు, గొర్రెలు, బర్రెలు, పశువులు వంటి ప్రయోజనాలు పొందాలంటే ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘ సభ్యులై ఉండాలి. ఈ సంఘాల్లో సభ్యులైన వారికే ప్రభుత్వపరంగా అందించే ప్రయోజనాల్లో ప్రాధాన్యత దక్కుతుంది. ఇంతటి కీలకమైన ఈ సంఘాల జిల్లా అధ్యక్ష ఎన్నికలు ఐదేళ్లుగా పత్తాలేకుండా పోయాయి. మండల సంఘాల ఎన్నికలు సకాలంలో జరగకపోవడం, వాటి నిర్వహణపై జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారులు దృష్టి సారించకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తింది. ఫలితంగా క్షేత్రస్థాయిలో సరైన ప్రచారం జరగక గొల్ల, కుర్మలకు అన్యాయం జరుగుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది.



జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయం

ఐదేళ్లుగా పత్తాలేని అధ్యక్ష ఎన్నికలు

జిల్లా ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘ అధ్యక్ష ఎన్నికలు ఐదేళ్లుగా పత్తా లేకుండాపోయాయి. జిల్లా పునర్విభజనకు ముందు ఉమ్మడి జిల్లా సహకార సంఘం అధ్యక్షుడిగా మంచిర్యాల జిల్లాకు చెందిన రెంకల హన్మండ్లు యాదవ్ పనిచేశారు. ఆ తర్వాత 2018 నుంచి ఈ పదవికి ఎన్నికలు నిర్వహించ లేదు. నిబంధనల ప్రకారం 70సొసైటీల మండల అధ్యక్షులు ఎన్నికైతే జిల్లా అధ్యక్ష ఎన్నికలు నిర్వహించవచ్చనేది అధికారులే చెబుతున్నారు. కానీ ఇప్పటి వరకు ఆ దిశగా కసరత్తు చేయడం లేదు. జిల్లాలో 97 సొసైటీలకు అధ్యక్షులు ఎన్నికయ్యారు. వీరి పదవీకాలం ఇప్పటికే సగం గడిచిపోయింది. అయితే జిల్లా అధ్యక్షుడి ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనే దానిపై స్పష్టత లేకపోవడం గమనార్హం. అధ్యక్షుడు ఉన్నట్లైతే గొల్ల, కుర్మల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి మార్గం చూపే అవకాశముంటుందని కులస్తులు చెబుతున్నారు.

ఎన్నికలు వెంటనే నిర్వహించాలి



మండల సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నికై రెండేళ్లు గడుస్తున్నా ఇంకా జిల్లా ఎన్నికలు నిర్వహించడం లేదు. ఓ వైపు పదవీ కాలం ముగిసేదశకు వస్తున్నా ఎప్పుడు నిర్వహిస్తారనే దానిపై స్పష్టత లేదు. గొల్ల, కుర్మలు ఏవైనా సమస్యలు చెప్పుకోవాలంటే ఎవరిని కలువాలో తెలియడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే జిల్లా అధ్యక్ష ఎన్నికలు నిర్వహించాలి. – మేకల రవికాంత్, తలమడుగు సొసైటీ అధ్యక్షుడు

మండలస్థాయి ఎన్నికలు పూర్తికాలేదు



అన్ని మండలాల్లో ఈ సొసైటీ అధ్యక్ష ఎన్నికలు ఇంకా పూర్తికాలేదు. జిల్లాలో 97 మాత్రమే పూర్తయ్యాయి. ఓటరు జాబితా తయారీ కోసం మిగతా సంఘాల సభ్యుల ఆధార్ వివరాలు కోరుతున్నాం. కానీ వారు స్పందించట్లేదు. పూర్తి వివరాలు అందిన వెంటనే ఓటరు జాబితా సిద్ధం చేసి రాష్ట్ర సహకార శాఖకు పంపిస్తాం.

– కిషన్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

క్లుప్తంగా

ఉమ్మడి జిల్లాకు మూడు డిగ్రీ గురుకులాలు

కౌటాల(సిర్పూర్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు కొత్తగా మూడు బీసీ డిగ్రీ గురుకులాల ఏర్పాటుకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం మహాత్మాజ్యోతి పూలే గురుకులాల డిగ్రీ కళాశాలలను ఆదిలాబాద్, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ప్రిన్సిపాల్ కార్యదర్శి బీ వెంకటేశం ప్రకటించారు. దీంతో ఆయా జిల్లాలోని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ఇచ్చోడ: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలల్లో బీఎస్సీ డిజైన్, టెక్నాలజీ కోర్సుల కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రభుజ్యోతి తెలిపారు. జూన్ 28న దరఖాస్తుల స్వీకరణ ముగియనుందని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 7675897485, 9059663002 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

దూడల పట్టివేత

భైంసాటౌన్: అక్రమంగా తరలిస్తున్న రెండు దూడలను పోలీసులు పట్టుకుని గోశాలకు అప్పగించినట్లు పట్టణ ఎస్సై ఎండీ సాదిక్ హుస్సేన్ తెలిపారు. కుభీర్ మండలం చాత గ్రామానికి చెందిన ఇద్దరు గురువారం రాత్రి కిసాన్‌గల్లి బొర్రగణేశ్ వద్ద అనుమానాస్పద స్థితిలో దూడలను తీసుకెళ్తూ కనిపించారు. గస్తీలోని పోలీసులు వారిని పట్టుకుని దూడలను స్వాధీనం చేసుకున్నారు. దూడలను గోశాలకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

12 మేకలు మృతి



మృతి చెందిన మేకలు

ఇంద్రవెల్లి: గుర్తు తెలియని మృగం దాడిలో మేకలు మృతి చెందిన సంఘటన మండలంలోని బిక్కుతండాలో చోటుచేసుకుంది. మేకల యజమాని రాథోడ్ అమర్‌సింగ్, గ్రామస్తుల వివరాల ప్రకారం.. గురువారం సాయంత్రం మేకలను మేతకు తీసుకెళ్లి ఇంటికి తీసుకొచ్చి కొట్టంలో బంధించారు. రాత్రి వర్షం కారణంగా అటువైపు ఎవరూ పోలేదు. ఆ సమయంలో మేకల మందపై గుర్తు తెలియని మృగం దాడి చేయడంతో 12మేకలు మృతి చెందాయి. ఐదు మేకలకు గాయాలయ్యాయి. మృతి చెందిన మేకల విలువ సుమారుగా రూ.లక్ష వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు. శుక్రవారం ఉదయం విషయం తెలుసుకున్న పశువైద్యాధికారి హీరలాల్, అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. గాయాలైన మేకలకు వైద్యం అందించారు.

గీత కార్మికుడికి గాయాలు

దహెగాం: మండలంలోని హత్తిని గ్రామానికి చెందిన గీత కార్మికుడు ముక్కెర రాజాగౌడ్ తాటి చెట్టుపై నుంచి పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. శుక్రవారం సాయంత్రం రాజాగౌడ్ పాత హత్తినిలోని తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు మంచిర్యాలలోని ఆస్పత్రికి తరలించారు.

మాయ‘లేడీ’ బాగోతం

- బయటపడుతున్న మరికొన్ని ఘటనలు
- ఉద్యోగాలు ఇప్పిస్తానని మరో నలుగురి నుంచి రూ.3లక్షలు వసూలు
- ఆందోళన చెందుతున్న బాధితులు
- ఫిర్యాదు చేయాలంటున్న పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: మోసపోయేవారు ఉంటే మోసం చేసేవారికి కొదవ లేదన్నట్టుగా మాయ‘లేడీ’ తోట రజిత బాగోతం తవ్వినకొద్ది బయటపడుతోంది. ఇటీవల రైల్వే ఉద్యోగం ఇప్పిస్తానని 10మంది నుంచి రూ.49.40 లక్షలు వసూలు చేసిన కి‘లేడీ’ రోజురోజుకూ అక్రమాలు బయట పడుతున్నాయి. ఓ మహిళ నుంచి రూ.2లక్షలు తీసుకోగా, ఇంకో మహిళ నుంచి రూ.50వేలు, ఇద్దరు నిరుద్యోగుల నుంచి రూ.15వేల చొప్పున డబ్బులు కాజేసింది. ఇటీవల ఆమె అరెస్టు అయిన విషయం బాధితులకు తెలియడంతో లబోదిబోమంటున్నారు. ప్రస్తుతం ఆమె కటకటాలను లెక్కిస్తున్న విషయం తెలిసిందే. వీరితో పాటు మరికొంత మంది బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది.

తవ్వినకొద్దీ అక్రమాలే..

ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన సుజాత నుంచి రూ.2లక్షలు తీసుకొని ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికింది. బాధిత మహిళ భర్త మృతిచెందగా ఆమె ఇద్దరు కుమార్తెలను కూలీనాలి చేసుకుంటూ పోషిస్తోంది. ఇందులో ఒక కుమార్తె వైకల్యంతో బాధపడుతుండగా, మరో చిన్నారి 5వ తరగతి చదువుతోంది. ఈమె డిగ్రీ పూర్తి చేసింది. ఉద్యోగం వస్తే ఆర్థిక సమస్యలు తీరుతాయనే ఆశతో ఆ లేడీకి డబ్బులు ముట్టజెప్పినట్లు చెబుతోంది. బాధిత మహిళకు తలమడుగు మండలం లక్ష్మిపూర్‌కు చెందిన ఓ మహిళ రజితను పరిచయం చేసింది. దీంతో మొదట ఆమె పేటీఎం ద్వారా రూ.45వేలు పంపించింది. మిగితా డబ్బులు ఇస్తేనే ఉద్యోగం వస్తుందని చెప్పడంతో మెడలోని మూడున్నర తులాల బంగారం అమ్మి మిగితా డబ్బులు చెల్లించింది. మొదట డీఈఓ కార్యాలయంలో క్లస్టర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పింది. ఆ ఉద్యోగం రాలేదంటూ కేజీబీవీలో అకౌంటెంట్, అగ్రికల్చర్ కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పింది. బాధితురాలు ఆమెను కలవడంతో బీసీ వెల్ఫేర్‌లో రికార్డు అసిస్టెంట్ అంటూ అనేక విధాలుగా తిప్పుకుంది. మూడు నెలల కిందట ఈమెతో పాటు నలుగురు వ్యక్తులను హైదరాబాద్‌కు పంపించింది. అక్కడ ఓ వ్యక్తిని కలవాలని తెలిపింది. వెంటనే వెళ్లకపోతే ఉద్యోగం రాదని, ఇచ్చిన డబ్బులు తిరిగి రావని నమ్మబలికింది. బాధితులు వెంటనే హైదరాబాద్‌కు చేరుకున్నారు. అక్కడ ఓ వ్యక్తికి ఫోన్ చేయగా అతను మరో వ్యక్తిని పంపించాడు. వారి నుంచి రెజ్యూమ్ తీసుకొని వెళ్లిపోయాడు. తర్వాత ఈ మాయలేడీకి ఫోన్ చేస్తే స్పందించలేదని బాధితురాలు వాపోయింది. అక్రమాలకు పాల్పడిన ఆ మహిళ గురించి ఇటీవల వార్తలు ప్రచురితం కావడంతో బాధితురాలు అవాక్కయ్యింది. ఏమి చేయాలో తెలియక సతమతమవుతోంది.




इंडियन रेलवे केटरिंग एण्ड टूरिज्म कॉर्पोरेशन लिमिटेड
(भारत सरकार का उपक्रम-मिनी रत्न)
INDIAN RAILWAY CATERING AND TOURISM CORPORATION LTD.
(A Govt. of India Enterprise- Mini Ratna)

JOINING LETTER

రైల్వే ఉద్యోగానికి సంబంధించి బాధితులకు అందించిన అపాయింట్‌మెంట్ ఆర్డర్ కాపీ

మరికొందరు...

ఇంద్రవెల్లి మండలం గౌరపూర్‌కు చెందిన నిరుద్యోగి నుంచి రూ.15వేలు తీసుకుంది. రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించింది. ఐడెంటి కార్డు అందజేసింది. అతను నమ్మకపోవడంతో అక్కడికే ఆగిపోయింది. తాను ఇచ్చిన డబ్బులు తిరిగివ్వాలని అడుగగా ఉద్యోగంలో చేరే మరో వ్యక్తి డబ్బులు ఇచ్చిన తర్వాత ఇస్తానని చెప్పి ఇవ్వలేదు. ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ప్రఫుల్ అనే వ్యక్తి నుంచి రూ.15వేలు తీసుకుంది. అతడికి కూడా రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించింది. దీంతోపాటు తలమడుగు మండలం ఐకేపీలో పనిచేసే ఓ మహిళ నుంచి రూ.50వేలు తీసుకుంది. ఈమెకు సోషల్ వెల్ఫేర్‌లో రికార్డు అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి మోసం చేసింది. ఇలా బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతూ పోతోంది. దాదాపు రూ.కోటి వరకు బాధితులకు టోకరా వేసినట్టు తెలుస్తోంది. ఇప్పటికే పది మంది బాధితులు పోలీసులను ఆశ్రయించగా మిగితా వారు కూడా ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.



గూగుల్‌ప్లే ద్వారా రూ.15వేలు పంపిన బాధితురాలు

ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తాం



రైల్వే ఉద్యోగాలు ఇప్పిస్తానని రజిత ఇదివరకు పది మందిని మోసం చేసింది. వారినుంచి డబ్బులు కాజేసింది. బాధితుల ఫిర్యాదు మేరకు ఆ మహిళపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించాం. ఆమెకు డబ్బులు ఇచ్చిన వారెవరైనా ఉంటే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తాం. బాధితులకు న్యాయం జరిగే విధంగా చర్యలు చేపడతాం. నిరుద్యోగులెవరూ ఉద్యోగాల కోసం ఎవరిని నమ్మి మోసపోవద్దు.

– ఉమేందర్, డీఎస్పీ, ఆదిలాబాద్

తహసీల్దార్‌పై అనుచిత పోస్టులు చేసిన వ్యక్తి అరెస్ట్

లక్ష్మణచాంద: తహసీల్దార్‌పై అనుచిత పోస్టులు చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని పొట్టపెల్లి గ్రామానికి చెందిన మాచట్టి శ్రీను, చామన్‌పెల్లి గ్రామానికి చెందిన వరుణ్ అనే ఇద్దరు వ్యక్తులు వీధి కుక్కలను పట్టుకెళ్లి వాటిని చంపి జింక మాంసం అంటూ విక్రయించేవారు. ఇదే క్రమంలో మండల కేంద్రానికి చెందిన ఆనంద్ అనే వ్యక్తి పెంపుడు కుక్కను మే నెల 30 న ఇంటి నుంచి అపహరించి దానిని చంపి జింక మాంసం అని నమ్మించిన చామన్‌పెల్లి, లక్ష్మణచాంద గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులకు విక్రయించారు. ఇదే అదునుగా భావించిన మండల కేంద్రానికి చెందిన కుంటాల సాయన్న అనే వ్యక్తి గతంలో రెవెన్యూ సిబ్బందితో ఉన్న గొడవలను దృష్టిలో పెట్టుకొని ఈ నెల 7వ తేదీ రాత్రి తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది జింక మాంసం అని కుక్క మాంసం తిన్నారని తప్పుడు మెసెజ్ టైప్ చేసి తను క్రియేట్ చేసిన యువ సైన్యం అనే వాట్సాప్ గ్రూపులో పోస్టు చేశాడు. దీంతో రెవెన్యూ సిబ్బంది ఫిర్యాదు మేరకు సాయన్నను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్సై రాహుల్ తెలిపారు. నిందితుడి నుంచి మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

డిగ్రీలో 8 మంది డిబార్

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం జరిగిన పరీక్షల్లో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో ఎనిమిది మంది విద్యార్థులు డిబార్ అయ్యారని పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ నరేందర్ తెలిపారు. ఇచ్చోడలోని వివేకానంద డిగ్రీ కళాశాలో నలుగురు, భైంసాలోని సరస్వతి డిగ్రీ కళాశాలలో ఇద్దరు, బెల్లంపల్లిలోని భవిత డిగ్రీ కళాశాలో ఒకరు, మంచిర్యాలలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఒకరు డిబార్ అయినట్లుగా ఆయన పేర్కొన్నారు.

బీసీ హాస్టల్ కోసం వినతి



హైదరాబాద్‌లో బీసీ వెల్ఫేర్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

తానూరు: ఎల్వి గ్రామంలో బీసీ హాస్టల్ మంజూరు చేయాలని ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డితోపాటు స్థానిక నాయకులు హైదరాబాద్‌లోని బీసీ వెల్ఫేర్ కమిషనర్ బీ.నర్సయ్యను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మాట్లాడుతూ ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలలో 200 మంది విద్యార్థులు వివిధ గ్రామాల నుంచి వచ్చి చదువుకుంటున్నారని తెలిపారు. వారి సౌకర్యార్థం బీసీ వసతిగృహం మంజూరు చేయాలని కోరారు. రెండేళ్ల క్రితం హాస్టల్ మంజూరు కోసం అధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. భోసి గ్రామంలోని బీసీ వసతిగృహంలో 120 ఉన్న సీట్ల సంఖ్యను 175 వరకు పెంచాలని కోరారు. స్పందించిన కమిషనర్ ఎల్వి గ్రామంలో వసతులను పరిశీలించి హాస్టల్ మంజూరు చేసేలా కృషిచేస్తామన్నారు. భోసి గ్రామంలోని బీసీ హాస్టల్‌లో సీట్లు పెంచేలా చూస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోతారెడ్డి, మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, మాజీ కోఆప్షన్ సభ్యుడు చంద్రకాంత్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

రాయితీపై నాణ్యమైన కొబ్బరి మొక్కలు

ఉట్నూర్‌రూరల్: కొబ్బరిసాగు చేసే రైతులకు తక్కువ ధరకే నాణ్యమైన కొబ్బరి మొక్కలు అందించడంతో పాటు, రెండు సంవత్సరాల నిర్వహణ కోసం రాయితీ కూడా కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు ద్వారా ఇవ్వనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు హార్టికల్చర్ అధికారి గుడిమళ్ల సందీప్ కుమార్ తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో మొక్క రూ.150 నుంచి రూ.250 వరకు ఉండగా ఐటీడీఏ ఉద్యాన నర్సరీల్లో రూ.50 నాణ్యమైన మొక్కలు అందుబాటులో ఉన్నాయని, ఒక్కో మొక్కకు సంవత్సరానికి రూ.20 చొప్పున రెండు సంవత్సరాల పాటు రూ.40 రాయితీ సీడీబీ ద్వారా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల రైతులు భూమి పాస్‌బుక్, ఆధార్, పాస్ ఫొటో, బ్యాంకు అకౌంట్ జిరాక్స్‌లతో రావాలని, ఇతర వివరాలకు ఫోన్ నం. 8790230313 సంప్రదించాలని కోరారు.



మొక్కలను పరిశీలిస్తున్న సందీప్ కుమార్

అక్రమంగా నిల్వ ఉంచిన పుస్తకాలు పట్టివేత

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్ కాలనీలోని ఓ నివాస గృహంలో అక్రమంగా నిల్వ ఉంచిన పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, తదితర సామగ్రిని శుక్రవారం విద్యాశాఖ అధికారులు గుర్తించారు. ఖానాపూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రవిబాబు వివరాల ప్రకారం.. ఓ నివాస గృహంలో పాఠ్యపుస్తకాలు, సామగ్రిని నిల్వ ఉంచి ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యం యథేచ్ఛగా విక్రయిస్తున్నారని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ కీర్తి శశిందర్, విభాగ్ ఎస్‌ఎఫ్‌ఎస్ కన్వీనర్ శివకుమార్, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దుర్గ ప్రసాద్‌లు ఫిర్యాదు చేయడంతో జిల్లా విద్యాధికారి రవీందర్‌రెడ్డి, ఏంఈవో మధుసూదన్‌ల సూచన మేరకు పాఠ్యపుస్తకాలు నిల్వ ఉంచి గదిని సీజ్ చేశారు. ఇంటి యజమాని, గది నిర్వాహకులు ఎవరు అందుబాటులో లేకపోవడంతో పోలీసు సిబ్బంది సమక్షంలో ఇంటిని సందర్శించి గదిని రెండువైపులా సీజ్ చేశామని పేర్కొన్నారు. తదుపరి విచారణ అనంతరం శాఖపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో పాటు స్థానిక అధికారులు ‘మామూలు’గా వ్యవహరించడంతోనే విద్యా వ్యాపారంగా మారి, పేదలకు అందని ద్రాక్షగా మారుతోందన్నారు. అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.



గదిని సీజ్‌చేస్తున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం రవిబాబు

ఎదుగుదలను ఓర్వలేకనే ఆరోపణలు

- టీజీవో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, జగిత్యాల డీటీసీ శ్యామ్‌నాయక్

ఆదిలాబాద్‌టౌన్: నా ఎదుగుదలను ఓర్వలేకనే కొందరు నాపై బురదజల్లే ప్రయత్నాలు చేశారని టీజీవో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, జగిత్యాల డీటీసీ శ్యామ్ నాయక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ సంఘ భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 30న స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. నా ప్రోత్సాహంతోనే తన భార్య రేఖాశ్యామ్‌నాయక్ రాజకీయాల్లో కొనసాగుతున్నారని తెలిపారు. నా సతీమణిని రాజకీయంగా ఇబ్బందులు పెట్టాలనుకొని పరోక్షంగా కొందరు తనను టార్గెట్ చేశారని తెలిపారు. విద్యార్థి దశ నుంచే సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేశానని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నట్లు వివరించారు. నాపై నమ్మకంతో గెజిటెడ్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా నియమించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రవాణాశాఖ విషయమై ప్రభుత్వానికి లేఖ రాయడంతో రూ.100కోట్లు ప్రభుత్వ ఖజానాకు లాభమైందన్నారు. ప్రజలకుసేవ చేయాలనే ఉద్దేశంతో ఉద్యోగానికి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేయనున్నట్లు తెలిపారు. రవాణ శాఖలో మొదట రాయలసీమలో, ఆ తర్వాత మంచిర్యాల, ఆదిలాబాద్, తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహించినట్లు చెప్పారు. సమావేశంలో టీజీఓ జిల్లా ప్రధాన కార్యదర్శి వనజా రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు శివ కుమార్, టీఎన్‌జీఓ జిల్లా కార్యదర్శి ఎడ్ల నవీన్ కుమార్, నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాధర్, ఉద్యోగ సంఘాల నాయకులు రాజేందర్ దేశ్‌పాండే, తిరుమల్ రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్యామ్ నాయక్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రాజు(ఫైల్)

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నిర్మల్ జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్‌కు చెందిన బ్రమ్మదండి రాజు (38) మృతి చెందాడు. బంధువుల వివరాల మేరకు... బ్రమ్మదండి రాజు ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. శుక్రవారం ద్విచక్ర వాహనం (స్కూటీ) పై భైంసా మండలం మహాగాం గ్రామంలోని భార్య, పిల్లలను చూసి నిర్మల్‌కు బయలుదేరాడు. ఎదురుగా వచ్చిన ఐచర్ వాహనం ఢీ కొనడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య సునీత, ఇద్దరు కుమారులు శివ కుమార్, అంజికుమార్ ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



గాయపడ్డ శంకర్

గుడిహత్నూర్: మండలంలో జాతీయ రహదారి 44పై మన్నూర్ వద్ద జరిగిన ప్రమాదంలో సాయినగర్‌కు చెందిన శంకర్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం... శంకర్ మన్నూర్ వద్ద చిన్న హోటల్ నడుపుతున్నాడు. ఎప్పటిలాగే సాయినగర్ నుంచి జాతీయ రహదారి మీదుగా నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం శంకర్‌ను ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అంబులెన్సులో రిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు.

మృతదేహం ఆచూకీ లభ్యం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి ధర్మసాగర్ చెరువు కట్ట సమీపంలో కనిపించిన మృతదేహం ఆచూకీ లభ్యమైనట్లు పట్టణ ఎస్సై మహేష్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... హన్మకొండ జిల్లా కమలాపూర్‌కు చెందిన నడిగొట్టు కోటి (33) పదేళ్ల క్రితం ఖానాపూర్‌కి వచ్చి కులవృత్తి చేసుకుంటూ జీవిస్తున్నాడు. రెండేళ్ల క్రితం ఖానాపూర్‌కు చెందిన భర్త చనిపోయిన సునీతను వివాహం చేసుకున్నాడు. ఇటీవల మద్యానికి బానిసకావడంతో ఈ నెల 19న తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. వెంటనే భార్య నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో చేర్పించింది. మద్యం లేకపోవడంతో ఈ నెల 20న ఆస్పత్రిలో గోడ దూకి పారిపోయాడు. దీంతో అతడి భార్య సునీత పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 21న ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 22న ధర్మసాగర్ చెరువు కట్ట వద్ద మృతదేహం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కోటిగా గుర్తించి అతడి భార్యకు మృతదేహాన్ని అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

మద్యం మత్తులో ఒకరి మృతి

తలమడుగు: మద్యం మత్తులో ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తలమడుగు మండలంలోని ఉండమ్ గ్రామ సమీపంలో మహారాష్ట్రలోని కిన్వాట్ తాలుకాలోని బోధిడి గ్రామానికి చెందిన వివహార సంజీవ్ (48)ఉండమ్ గ్రామ రైల్వేస్టేషన్ సమీపంలో మృతి చెందాడు. సంజీవ్‌కు 2001లో మండలంలోని శాంతినగర్ చెందిన మాయ దేవితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు. ఈ నెల 19వ తేదీన బోదిడి గ్రామం నుంచి బయలుదేరి వచ్చాడు. మద్యం మత్తులో ఉండమ్ రైల్వేస్టేషన్ సమీపంలో పడిపోయి మరణించారు. శుక్రవారం మధ్యాహ్నం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై అప్పారావు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వద్ద ఉన్న సెల్ ద్వారా కుటుంబీకులకు విషయం తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలిక అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన బాలిక అదృశ్యమైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బాలిక గురువారం ఇంటి నుంచి వెళ్లింది. రాత్రి అయినప్పటికీ తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు ఆమె కోసం చుట్టుపక్కల గాలించారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

యువకుడి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని చిల్కూరి లక్ష్మినగర్ కాలనీకి చెందిన మోచి రాహుల్ అనే యువకుడు అదృశ్యమైనట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మేస్త్రీ పనిచేస్తున్న యువకుడు రోజులాగే పని కోసం ఈనెల 20న ఇంటి నుంచి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు తెలిసిన వారి వద్ద గాలించారు. ఫోన్ కూడా స్విచ్ ఆఫ్‌గా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో శుక్రవారం సోదరుడు శివాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

ఇద్దరు పిల్లలతో మహిళ అదృశ్యం

నెన్నెల: మండలంలోని గుండ్లసోమారం గ్రామానికి చెందిన మహిళ తన ఇద్దరు పిల్లలతో అదృశ్యమైనట్లు ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. ఈ నెల 21న రాత్రి ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి పిల్లలను తీసుకుని వెళ్లిపోయింది. రెండు రోజుల పాటు తెలిసిన వారి ఇళ్లల్లో వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో శుక్రవారం భర్త ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

పోదాం పదా.. పొలానికి



బుర్కపల్లిలో సోయా విత్తనాలు వేస్తున్న రైతన్నలు

నేరడిగొండ: తొలకరి వర్షాలతో రైతులు పొలం బాట పట్టారు. ఇన్నీ రోజుల పాటు వర్షాలు లేక రైతులు వ్యవసాయ పనులను చేపట్టలేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్ పనులు మొదలుపెట్టారు. దుక్కులు దున్ని విత్తనాలు వేస్తున్నారు. ఇంటిల్లిపాది పనుల్లో నిమగ్నమవుతున్నారు. ప్రభుత్వం కూడా సబ్సిడీపై సోయాబీన్, పెసర, మినుములు, కంది విత్తనాలు అందిస్తోంది. ఏదో మొక్కుబడిగా కాకుండా అన్ని విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై అందించి ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.



బుగ్గారం(బి)లో ఇంటిల్లిపాదీతో కలిసి విత్తనాలు విత్తుతున్న రైతులు